# ఇదీ ఒక టీ.వీ. క(బా)థే!

కొత్తపల్లి ఉదయబాబు

"కాత్యా! కాత్యా! తొందరగా రా! మనింటికి ఎవరొచ్చారో చూడు" అని భార్య కాత్యాయనిని పిలిచి, కొత్తగా తెచ్చిన టీవీని సెట్ చేసిన ప్లేసులో పెట్టించాడు, ఆఫీసులో హెడ్ గుమాస్తాగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు.

మిలమిలలాడుతూ, ఏ కోణం లోంచి కాంతి దాని మీద పడినా మెరపుల్ని పరావర్తనం చెందిస్తూ కొత్త స్టాండు మీద అమర్చిన కొత్త టీ.వీ.ని చూస్తూనే స్థాణువులా ఉండిపోయింది కాత్యాయని.

టీ.వీ. ఆన్ చేయబోయిన వారి ప్రయత్నాన్ని వెంకటేశ్వర్లు వెంటనే అడ్డుకున్నాడు. ముహూర్తబలం, తారాబలం, హోరా కాలం చూసుకుని ఏ కొత్త పనైనా చేసే అలవాటున్న వెంకటేశ్వర్లు. వాళ్లకి సంతోషం కొద్దీ టీ తాగేందుకు చిల్లర డబ్బు యిచ్చి పంపేసి వెనుదిరిగాడు. అంతే!

"హేమండీ!" అంటూ కాత్యాయని అరచిన అరుపుతో, అతని గుండె మూడంగుళాలు కిందకి జారిపోయిందనే అనుకున్నాడు. కానీ కాత్యాయని అతని బుగ్గల గిన్నెల్ని ముద్దుల ముద్దబంతి పూలతో నింపేసింది.

నోటి లోపలి వైపు రెండు దవడలు కలిసిపోయిన ముఖంలో పక్షి గుడ్ల లాంటి పొడుచుకువచ్చిన కళ్లతో, దట్టంగా పెరిగి రాక్షసుడిని గుర్తు చేసే కనుబొమ్మలతో నుదుట సన్నటి పొడుగాటి ఏకనామంతో, గరుత్మంతుడి ముక్కుతో, సముద్రం ఒడ్డున దొరికిన పెద్ద ఆల్చిప్ప లాంటి ఛాతితో T ఆకారానికి షర్టు వేసి నట్టున్న వెంకటేశ్వర్లు పర్సనాలిటీ చూసి, లొట్టం గొట్టం పర్సనాలిటీ అనుకునేరు. అతనితో వ్యవహారం ఆషామాషీ కాదు. వెంట్రుక ముడి వేసి కొండను లాగగల సమర్థుడు.

అయితే అది యింటా, బయటా మాత్రమే.

కాత్యాయనితో అతనికి పెళ్లయి ఏడాదిన్నర అయింది. మొదటి ఆరు నెలలూ ఎంతో అన్యోన్యంగా గడిపినా కాత్యాయని కడుపు పండలేదు. అతను బలహీనంగా ఉన్నాడని డాక్టరు చెప్పడంతో, బలం కోసం ఏడాది కాలంగా మందులు వాడుతున్నాడు. తిన్న మందులకి అతనికి బలం చేకూరడం మాట అటుంచి, అతని ఎముకలు మరింత స్టిఫ్‌గా తయారయ్యాయి. దానికి తోడు లూజ్‌గా (తనకు చాలా బాడీ ఉన్నట్టు బిల్డప్ యివ్వడానికి) బట్టలేస్తాడేమో అచ్చం నడుస్తున్న హేంగర్‌లా ఉంటాడు.

పట్టపగలే భార్య ముద్దివ్వడంతో డంగైపోయిన వెంకటేశ్వర్లు, తను కూడా ముద్దు పెట్టుకున్నాడు.


దాంతో కాత్యాయ నికి కోపం వచ్చేసింది. "మీకు నేను పర్మిషన్ యివ్వలేదు కదా! ఎందుకు చేశారీ పని?" అంది.

"మరి నువు నాకు పెట్టావు కదా! ఆపుకోలేకపోయాను" అన్నాడతను అమాయకంగా.

"ఆపుకోవాలి. మీరు టీవీ బహుమతిగా తెచ్చారు కనుక నేను బహుమతి యిచ్చాను. నేను మీకు 'ఆ' ప్రజంటేషన్ యిచ్చేటంతవరకూ ఆగాల్సిందే! అది సరే! ఉండండి. కొబ్బరికాయ కొట్టి టీవీ ప్రారంభిద్దాం" అంది వంటింట్లోకి వెళ్లబోతూ.

"ఆగు! యింకా ఆరు నిముషాల పాటు దుర్ముహూర్తం ఉంది. అదయ్యాక స్టార్ట్ చేద్దువు గాని. ఈ లోగా అన్నీ సిద్ధం చెయ్యి!" పురమాయించాడు భార్యకి.

కుందెలో నూనె వేసి వత్తి నలిపి పూలు, కొబ్బరికాయ, అగర్‌బత్తి, హారతి కర్పూరం, పళ్లు మొత్తం పూజాసామగ్రి తెచ్చేసింది కాత్యాయని.



సుముహూర్తసమయంలో, దీపం వెలిగించి కొబ్బరికాయ కొట్టి లలితాసహస్రం, విష్ణుసహస్రం, కనకధారాస్తకం ఆపకుండా అరగంటలో చదివి పారేసి, హారతిచ్చి భర్తకు ప్రసాదం పెట్టి తాను తిని టీ.వీ. ఆన్ చేసింది కాత్యాయని.

ఆంధ్రుల ఆరాధ్యదైవం; నటరత్న ఎన్టీ రామారావు గారు కృష్ణుడి వేషంలో మొదటి సారిగా తన టీవీలో దర్శనమిచ్చే సరికి, ఆమె హృదయం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. మనఃపూర్వకంగా నమస్కరించుకుని టీ.వీ. రిమోట్ అందుకుంది.

ఆ యింట్లో ఆమె చేసిన ఆఖరి పూజ అదేనని తెలియని వెంకటేశ్వర్లు, భార్య ముఖంలో కనిపిస్తున్న ఆనందానికి సంతృప్తి చెందుతూ, శరీరంలోని ఎముకలను, వాటి చుట్టూ ఉన్న పల్చటి మైదా పొర లాంటి చర్మాన్ని శుభ్రపరచుకోవడానికి బాత్రూమ్‌లో దూరాడు.

ఆ విధంగా వారింట్లో టీ.వీ. సందడి మొదలైంది.

** ** **

భర్త ఆఫీసుకు వెళ్లిపోయాక వంటయిల్లు సర్దుకోవడం గబగబా ముగించి వచ్చి టీ.వీ. ముందు కూర్చుని ఒక ఛానెల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వచ్చే అన్ని కార్యక్రమాలు వదలకుండా చూడడం మొదలెట్టింది కాత్యాయని. డైలీ సీరియల్స్‌లో ముఖ్యమైన పాయింట్స్‌ని వాడుకుని, భర్తని ఎలా తను టర్న్ చేసుకోవచ్చో అవన్నీ ఓ నోట్ బుక్‌లో నోట్ చేసుకోసాగింది. ఇంత కాలం బయట యిళ్ళ కెళ్లి టీవీ చూడటం, వాళ్లేమో మొహానే నానా మాటలు అంటుంటే పడాల్సిరావడం జరిగేది. ఇక ఆ అవసరమే లేదు కాబట్టి అందరినీ కొత్త టీవీ చూడటానికి రమ్మని చెప్పి వారందరూ వచ్చి చూశాక, నిర్మొహమాటంగా పని ఉందని చెప్పి పంపేసి తలుపు లేసుకుని మరీ చూడసాగింది.

ఒకరిద్దరెవరో చనువుగా మధ్యాహ్నం తలుపు కొట్టి యింట్లోకి రాబోతే "ఆయన వచ్చేవేళకు యింట్లో ఎవరైనా ఉంటే చిరాకుగా ఉంటుందోదినా! ఏమీ అనుకోకండి" అని చెప్పి పంపేసి టీవీ ముందు

చతికిల పడింది.

మరుసటి రోజు నుంచీ వంటల రుచి మారిపోవడంతో కొత్త టీవీ మోజులే అని సరిపెట్టుకున్నా రాను రాను వంట అతి వృష్టి, అనావృష్టిగా తయారవడంతో కాస్త చికాకే అనిపించింది వెంకటేశ్వర్లుకి. అయితే 'సముద్రం' సినిమాలో తనికెళ్ల భరణిలా భార్యంటే 'పిచ్చి' ప్రేమ చేత ఏమీ అనలేక సర్దుకుపోవడం మొదలెట్టాడు. సర్దుకుపోవడం అంటే ఏముంది, టిఫిన్ టైముకి ఏ పార్టీ వస్తే వాడితో టిఫిన్కు, భోజనం టైమ్కి ఏ పార్టీ వస్తే వాడికి శఠగోపం పెట్టి సర్దుకుపోవడం అలవాటు చేసుకున్నాడు వెంకటేశ్వర్లు.

భర్త టిఫిన్, భోజనం బయటచేస్తానన డంతో వంట బాధ తప్పింది కాత్యాయనికి. ఆ టైంలో సుబ్బరంగా తనకి ఎన్ని పిండి వంటలు వచ్చో అన్నీ వండి డబ్బాల్లో పోసుకుని, టీవీ ముందు కూర్చుని ఆ కార్యక్రమాలకి అంతరాయం లేనట్టే తన నోటికీ అంతరాయం యివ్వకుండా ఆడించడం అలవాటు చేసుకుంది.

నెల రోజులకే భర్త లావవ్వడం చూసిన కాత్యాయని తన కళ్లని తానే నమ్మలేకపోయింది. వెంకటేశ్వర్లు ముఖాన ఉన్న గోతులన్నీ పూడిపోయి రక్తం చిందేలా నున్ననైన బుగ్గలతో చక్కగా తయారయ్యాడు. లూజుగా ఉంటే షర్ట్, పాంట్స్, టీ షర్ట్, జీన్స్లా టైట్ అయ్యాయి.

"ఆ విశేషం ఏమిటో చెప్పరూ?"

గారంగా అడిగిన భార్యని నిలువెల్లా పరిశీలిస్తూ చెప్పాడు వెంకటేశ్వర్లు. "ఏముందోయ్! హోటల్ భోజనం. మనది కాని తిండి ఉంది చూశావు. మహరుచిగా ఉంటుందనుకో. ప్రస్తుతం లోకం అంతా దాని మీద ఆధారపడే బతుకుతోంది."

"ఏమండీ! కుర్చీలో కూర్చుని టీ.వి. చూస్తుంటే నడుము లాగుతోందండీ. సోఫా సెట్ ఓటి కొనిపెట్టరూ?"

"అన్నీ నన్నడుగుతావు. నేనడిగిన బహుమతి యివ్వలేదు గానీ!"

"తప్పనిసరిగా యిస్తాను. ఏం చెయ్యను చెప్పండి. రాత్రి నేను డైలీ సీరియల్స్ చూసి వచ్చేసరికి మీరు నిద్ర పోతారయ్యే. అలసిసొలసి వచ్చిన మనిషిని ఏం లేపను చెప్పండి!"

"రోజూ అలాగే ఏదో ఒక వంకతో పస్తు పడుకోపెట్టేస్తున్నావు. యిక మనకు పిల్లలెలా పుడతారేంటి?"

"అమ్మో! డైలీ సీరియల్స్ చూడడం మానేసి తొమ్మిది నెలలు ఆ కడుపెవడు మోస్తాడండీ! ఏమండీ. మీకు... మీకు కోపం రాదంటే ఒక్కమాట చెప్పనా!"

"చెప్పు. నీ మాట ఏదైనా కాదన్నానా?"


"అదిగో! అదే మరి. అన్నింటికీ నేనేదో పెంకితనం పోతున్నట్టు, మీరు బలవంతంగా నా కోరికలు తీరుస్తున్నట్టు మాట్లాడతారేం? అయితే నేను అడగనే అడగను." అంత క్రితం రాత్రి టీవీ సీరియల్లో వచ్చిన ఓ ట్రిక్ ప్లే చేసింది.

ఇంకేముంది? వెంకటేశ్వర్లు కాళ్ల బేరానికొచ్చాడు.

"అయామ్ సారీ కాత్యా! నిజంగా నీకు ఏం కావాలన్నా చేస్తాను. నీ మీద ఒట్టు."

"అయితే మనం టెస్ట్ ట్యూబ్ బేబీ పద్ధతిలో పిల్లల్ని కందామండీ. నాకూ శ్రమ ఉండదు. మీకూ శ్రమ ఉండదు. ఏమంటారు?"

వెంకటేశ్వర్లు ఆలోచనలో పడ్డాడు. మనిషికి కావాల్సినవి కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర. కావలసినవి పార్టీ నెత్తిన ఖర్చు రాసి తింటుంటే యింటికి వచ్చాక హాయిగా పడుకుని నిద్ర పోవాలనే అనిపిస్తోంది తప్పితే కాత్యాయని మీద



చెయి వెయ్యాలని కూడా అనిపించడం లేదు. తను చెయివేస్తే ఆమె వేస్తుంది. అలా అలా కార్యక్రమం పెరిగిపోతే అమ్మో. బంగారం లాంటి నిద్ర పాడైపోదూ? కాత్యాయని చెప్పిన పద్ధతి బాగా ఆలోచించిన మీదట నచ్చడంతో సరేనని "మరి చాలా డబ్బు ఖర్చవుతుందోయ్!" అన్నాడు.

"మీరు సాధ్యమైనంత పార్టీల దగ్గర గుంజండి. నేను యింట్లో సంపాదిస్తా."

"ఇంట్లో కూర్చుని నువు సంపాదిస్తావా! ఎలా?"

"నాకు సోఫాసెట్, సెల్ ఫోను కొనిచ్చారంటే మీ చేతుల్లో వేలకు వేలు పోస్తా."

"ఎలా?"

"నా మాట మీద నమ్మకం ఉందా లేదా?"

వెంకటేశ్వర్లు మాట్లాడలేదు.

"చెప్పండి! ఇలా పనికిమాలిన కబుర్లు చెబుతూ కూర్చుంటే ఎన్నో అవకాశాలు చేజారిపోతున్నాయి. మీకు నాతో మాటలు కావాలా? మూటలు కావాలా?"

"మూటలే కావాలి!"

"అయితే వినండి మరి!" అంటూ టీవీలో ఏఏ కార్యక్రమాలలో ఎలా పాల్గొంటే ఏఏ బహుమతులు ఎలా వస్తాయో, కూపన్స్ సెల్ ఫోన్లో డౌన్ లోడ్ చేసుకుంటే ఎలా వేలూ, లక్షలూ పొందవచ్చో, 'చెప్పుకుంటే చెత్త చీర' కార్యక్రమంలో పాల్గొని ఎలా చీరలు సంపాదించవచ్చో వివరంగా చెప్పింది కాత్యాయని.

ఆమె తెలివితేటలకు మురిసిపోతూ ఆమెను ముద్దు పెట్టుకుందామనుకున్నాడు. అయితే శరీరం సహకరించక బద్ధకం ఆవరించడంతో విరమించుకుని, సరేనన్నాడు.

ఆ వారంలోనే సోఫాలో కూర్చుని సెల్ ఫోన్ చేతిలో పెట్టుకుని టీవీ చూస్తున్న కాత్యాయనిని చూసి ఆ పేట పేటంతా కుళ్లుకున్నవాళ్లే.

** ** **

"హాయ్! నమస్తేనండి. వారం వారం మిమ్మల్ని ఎంతో అలరిస్తున్న మీ 'మాట కావాలా? మూట కావాలా!' కార్యక్రమానికి స్వాగతం, సుస్వాగతం. ఆలస్యం చేయకుండా కార్యక్రమంలోకి వెళ్లిపోయే ముందు ఈ నాటి మా కార్యక్రమానికి చదువు, సంధ్య, తిండీ, గుడ్డ లేక మాసిన గడ్డంతో ఎప్పుడూ దేని కోసమో వెతుకుతున్నట్టు కనిపించే బేవార్స్ హీరో 'అయిరన్ లెగ్ బాబు' గారు, మనం తెలుగులో మాట్లాడేదంతా అర్థమై యింగ్లీషులో మాత్రమే తెలుగు ప్రేక్షకులకు సమాధానం చెప్పే ముద్దు పల్కుల హీరోయిన్ 'నూలు పోగు మాలిని' గారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారితో మీరు కూడా చక్కగా ఎంజాయ్ చేస్తూ మాట్లాడవచ్చు. వీరిద్దరూ కలిసి మొదటిసారిగా నటించిన చిత్రం 'బేవార్స్ బాబు —నూలుపోగు పాప' విజయఢంకా మోగిస్తున్న సంగతి మీకు తెలిసిందే. యిపుడు ముందుగా ఫస్టు 'కాలరె'వరో చూద్దాం" యాంకర్ నవ్వుతూనే ఎనౌన్స్ చేసింది.

**(ఇంకా ఉంది)**